# ఆదర్శంకోసం

టెలిఫోను మోగ్రిగడంతో ఉలిక్కిపడి లేచింది ! శారద కాలేజీ నుంచి వచ్చి ఏదోఆలోచిస్తూ సోఫాలో కూర్చున్న తనకు తెలియకుండానే నిద్ర పట్టేసింది.

" సాయంత్రంవేళ నిద్రపోయేను ఇదేమిటి" ! అనుకుంటూ ఫోను చేతిలోనికి తీసికొంటూ "హల్లో" అంది.

"మీతో మాట్లాడాలి. పార్కుకి వస్తారా ! " అన్నాడు శంకర్.

"అలాగే !" అంటూ ఫోను పెట్టేసింది శారద. శంకర్ కోసం తాను ఎన్నో సార్లు ఇంచుమించు ప్రతీరోజు అతని కోసం తను పార్కుకి వెళ్ళుతోంది. ఊ !హు! ఈరోజు నించి ఇక వెళ్ళవలసిన అవుసరం లేదు. తన నిర్ణయాన్ని అతనికోసం మార్చుకోదు. కాని తానే నిర్ణయాన్ని మార్చు కుంటే ? తన పెళ్ళి శంకర్‌తో జరుగుతుంది కదా ! మన సిచ్చిన వాడితో మనుగడ ఎంత మదురంగా ఉంటుంది." ఈ ఆలోచన శారద మనస్సులో ఒక్కక్షణం మెరుపులా మెరిసింది. మళ్ళీ మాయమైంది. వీల్లేదు నా నిర్ణయానికి తిరుగులేదు నా ఆశయం, నేరవెర్చు కోవడంకోసం శంకర్‌ని మరిచి పోతాను. ఇలా ఆలోచిస్తున్న శారద, ఆలోచనలకు అంత-రాయం కలిగిస్తు మళ్ళీ ఫోను మోగ్రింది. మళ్ళీ అదే కంఠం.

"వస్తావా ! శారద !" ఆఁ ! "ఇప్పుడే వస్తున్నా !" అంటూ ఫోను పెట్టేసి గడియారం వైపు చూసింది. "అమ్మో ! 6 గంటలమీాద 20 నిముషాలు అయిందే ! చాలా టైం

అయ్యింది" అనుకుంటూ, మొహం కడక్కోకుండానే పౌడర ద్దుకుంటూ డ్రస్సుఅయినా మార్చుకోకుండా బయలుదేరింది.

శారదను చూసిన శంకర్ "నన్ను మర్చిపోవడానికి నిశ్చయించు కున్నావా శారదా !" అన్నాడు.

" నీ అభిప్రాయం మారకపోతే అంతేగా మరి. నీతో ఎన్ని సార్లు చెప్పేను. నా నిశ్చయాన్ని గురించి కట్నం తీసికొనేవాడ్ని నేను వివాహం చేసుకోను అని. తప్పంతా నాదే అన్నట్లు మాట్లాడతావేం ?" అంది శంకర్ కళ్ళలోకి తీక్షణంగా చూస్తు శారద.

"ఆదర్శాలు మాటల్లోనె అనుకున్నానే ! కలవారి అమ్మాయివి కాబోయే డాక్టరుని కట్నం లేకుండా, వివాహము ఆడాలని ఆశిస్తావనుకోలేదు కష్టపడి చదువు చెప్పించిన మా నాన్న, నేను, నీ కొసం కట్నం వదులు కోలేము" అని ఖచ్చితంగా చెప్పేశాడు శంకర్.

"అయితే ! వస్తా నిన్ను అంతగా మర్చి పోలేకపోతే ఒక ఫ్రెండుగా గుర్తించు కుంటాలే" అంటూ చక చక వెళ్ళిపోయింది శారద ఇప్పుడు శారద ప్రతీరోజు పార్కుకి వేళ్ళడం మానేసింది సంగీతం నేర్చుకోవడం కోసం, వెళ్ళుతోంది సంగీత సాధనలో పాత స్మృతుల్ని పూర్తిగా మరిచి పోగలిగింది. ఒకరోజు శారద తండ్రి సీతాపతి రావు గారు వచ్చి అమ్మా ! శారద.... రేపు....నిన్ను చూడ-డానికి పెళ్ళివారు వస్తున్నారు. నీకు తోడుగా ఉంటుంది. స్నేహితురాలు స్వర్ణని రమ్మని ఫోను చెయ్యమ్మా !" అన్నారు. తను ఏమీ మాట్లాడలేదు.

పెళ్ళి చూపులకి వచ్చిన శ్యామలరావు గారు "నీ పేరేమిటమ్మా" అన్నారు తలవంచుకొనే చెప్పింది తన పేరు శారదని.

"ఏమి చదివేరు" పెళ్ళికొడుకు శ్రీధర్ ప్రశ్నించేడు "బి.ఏ." అంది శారద.

"సంగీతం నేర్చుకొంటున్నారుగా ! ఓ మంచికీర్తన పాడమ్మా. మాయింట్లో అందరికి సంగీతం అంటే చాల ఇష్టం" అన్నారు. శ్యామలరావుగారు.

"పాడవే" అంటూ తంబూరాని శారద చేతికి అందించింది స్వర్ణ. ఒకసారి శృతి చూసి శ్రీరంజనీ రాగాలాపన చేసి "మారుబల్కకున్నా వేమిరా ! మా మనో రమణా !" అంటూ మధురంగా పాడింది. "చాలాబాగా పాడెవమ్మా" అన్నారు శ్యామలరావుగారు. మీకు అభ్యంతరం లేకపోతే మరో కీర్తన పాడండి". అన్నాడు శ్రీధర్.

"మా శారద మీ శ్రీమతి అయితే నిరభ్యంతరంగా ఏవైనా పాడుతుంది. ఇప్పటికి యింతే !" అంటూ శారద చేతిలోని తంబూర తీసి ప్రక్కన పెట్టేసింది స్వర్ణ.

"ఇక వస్తామండీ" అంటూ లేచిబోతున్న శ్యామల రావుగారితో " ఒక విషయం అండీ " అన్నారు సీతాపతి రావుగారు.

"ఏమిటో చెప్పండి" అన్నట్టుచూసేరు. శ్యామలరావు గారు. సీతాపతిరావుగారు సంకోచిస్తు ఉండగానే స్వర్ణ అంది.

మా శారద, కట్నం తీసుకునేవార్ని పెళ్ళిచేసుకోదు." అమాటకు శ్యామలరావు గారు, బిగ్గరగ నవ్వేరు. సీతాపతి రావుగారు తలవంచుకొని బాధతో" ఆదర్శం పేరుతో కట్నం తీసుకోకుండా డాక్టర్ని అల్లుడిగా చేసుకోవాలనాని పేరాశని చూసి నవ్వువస్తుందా ? అన్నారు "అబ్బే ! అదేం కాదండీ మా వాడిది అదే ఆదర్శం డాక్టరు కట్నం లేకుండా వివాహం చేసుకుంటున్నాడు అంటే, ఏదో కారణం ఉండే ఉంటుదనీ మా కొచ్చిన సంభంధాలన్ని తిరిగిపోయాయి."
అంటూ మళ్ళీ నవ్వడానికి ఉపక్రమించారు శ్యామలరావు గారు.

ఈసారి అతనితో సీతాపతీరావు గారు, స్వర్ణకూడ శృతికలిపి నవ్వేరు. ఆ నవ్వుల గల గలలో శారద శ్రీధర్‌ల కళ్ళుకలిసి నవ్వుకున్నాయి. ఈ సంగతి ఎవ్వరూ గమనించలేదు. శ్రీధర్‌కి శారదతో వివాహ మయ్యింది. పుత్తడి బొమ్మలా శోభనపు గదిలో అడుగు పెడుతున్న శారదను చూచి " నేను ఎంత అదృష్ట వంతుడ్ని శారద " నా ఆశయం నెరవేర్చవు" అన్నాడు శ్రీధర్.

"నా ఆశయాన్ని మీరే నెరవేర్చారు, నే నే ఆదృష్ణ వంతురాల్ని" అంది తడబడుతూ.

యువతీ యువకులంతా మనలాగే మంచి ఆశయాలు కలిగిఉంటే ఈ వరకట్న పిశాచం పూర్తిగా రూపుమాసి పోతుంది" అన్న శ్రీధర్ మాటకు, అవునన్నట్లు తలూపింది. శారద. "మనకు అమ్మాయి పుడితే కట్నం ఇవ్వద్దు అబ్బాయి పుడితే కట్నం తీసుకోద్దు" అన్నాడు మరల శ్రీధర్.

"అబ్బాయి అయినా, అమ్మాయి అయినా మనకు ఒక్కడే చాలు" అంది మెల్లగా శారద.

"ఆ ఒక్కరు నీలాంటి అందమైన అమ్మాయి అయితే నాకోరిక తీరుతుంది" అన్న శ్రీధర్ మాటకు సిగ్గుతో ముడుచుకుపోయిన శారదను దగ్గరకు తీసుకున్నాడు శ్రీధర్ తన హృదయాన్ని సర్వస్వాన్నీ అతనికి అర్పించి శ్రీధర్ హృదయంలో ఒరిగి పోయింది శారద

ఆకాశవాణి వారివ్యాఖ్య :

ఆదర్శాలు అందరికీ ఉంటాయి, కాని ఆచరణలో పెడితే కాని విలువ ఉండదు వాటికి ఒకరికోసం మన ఆదర్శాలను ఎందుకు చంపుకోవాలి. మన వ్యక్తిత్వాన్ని మనం ఎందుకు కాదను కోవాలి.

రచయితలు : సత్యవాడ సోదరీమణులు

ప్రసారం :- తరుణి మండలి, ఆకాశవాణి విజయవాడ

1-30 P.M. 16-7-81

★